
# పోస్ట్ చేయని లేఖ



రచన: "శశితేజ్"

వర్షిణీ నీ జ్ఞాపకాలు ప్రసాదిస్తున్న మధుర అనుభూతుల్ని శాశ్వతంగా మస్తిష్కంలో ఏ మూలనో భద్రపరచుకోవాలనే జిజ్ఞాసతో మన వెనుకటి క్షణాల్ని నెమరువేసుకుంటూ-నాలో నేనే ఓ మౌనకావ్యంలా-నీ ఆగమనాభిలాషినై, గుడిగంటలు లీలగా ధ్వనిస్తున్న శబ్దాన్ని వింటూ ఈ ఆలయం మొదటిమెట్టుపైనే నిలబడి నిరీక్షిస్తున్నా!


ఒకప్పుడు ఈ మెట్లన్నీ నీ పాద మంజీరాల స్వనాన్ని తనివితీరా వినేవి! కాలం ఎంత వింతయినది! వేగవంతమైనది! సుఖాన్ని, కష్టాన్ని, హాయిని, నిట్టూర్పుని అన్నింటిని మింగేస్తూ-తన దారిన తను వెళ్ళిపోతుంటుంది. మనిషిని గుప్పిట పడుతుంది. వేదాంతం, తాత్వీక చింతనల మిశ్రమంలా గీస్తున్న ఈ లేఖచిత్రం - ఒకరు చూసి మెచ్చుకపోయిన బాధలేదు. అసలీలోకంలో కొన్ని పనులు మనకొరకు మనం చేసుకునేవి! వాటిలో ఆనందం ఇతరులకి తెలీదు! ఇదీ కోవకి చెందినదనుకున్నా క్లేశపడను.

కాలం ఊదేసిన నీటి బుడగల్లా-ఒకరి జ్ఞాపకాలింకొకరికి గుర్తుండవలసిన అవసరం లేదనుకుంటే-విశ్వంలో ఇన్ని అందాలుండవు, కావ్యాలుండవు, రసాత్మకతకి చోటే వుండదు. యాంత్రికనైజమనే బ్లాక్‌హోల్స్‌లోనికి పయనించే మనిషి నడత తను గమనించినంతవరకు సుఖంగానే అన్పిస్తుంది. ఒక హృదయంకోసం మరొకటి-ఒక మనిషి కొరకు ఇంకొక మనిషి-అనిర్వచనీయ ఉద్విగతపులై పరితపించే క్షణాలు ఎన్ని ఇంద్రధనువులకి జన్మనిస్తున్నాయో తెలుసుకోవడం ఎంత కష్టమో అందరికీ తెలీదు,

తూర్పునే ఉదయించడం-పశ్చిమానే అస్తమించడం సూర్యుని అలవాటు. విరహాన్ని వ్యక్తీకరించడం-దూరాన్ని శాపంలా భావించడం సూర్యుని దినచర్యలానే ఈ లేఖలోనూ-రాయాలనిపించడంలేదు. జీవితాన్ని వాస్తవ దర్పణంలో చూడడం, వర్తమానాన్ని సాహస ధృక్పానికి వర్తింపజేయడం అలవాటైనా ఏ వ్యక్తి చేయలేడనిపిస్తుంది-నిజమేనా?

ఆలోచనలకి అందిన అన్ని మాటలు నాలికపైన ఊపిరి పోసుకోవు. అందులోనూ నీ ముందర! ఉచ్ఛ్వాశ్వంలా ఎగిరొచ్చిన కెరటాలు భారంగా, ఏదో గాంభీర్యాన్ని నింపుకొని నిశ్వాసలా వెనుదిరిగిపోతుంటాయి. అంతమాత్రంచేత కెరటాన్ని తీరం స్పృశించడం మానుతుందా! మరింత ఆప్యాయంగా అలలతలని నిమురుతూ - సుఖభారంతో ఏవేవో పిచ్చిగీతలు లిఖించుకుంటుంది తన భాషలో!

ఆ మాటంటే, ఆ పిచ్చిగీతలు ఈనా రాతలకి ఏం తీసిపోతాయిలే అనుకొని నవ్వుకుంటావా? కాని నీకావకాశమే లేదు. ఎందుకంటే అందంగా కనిపించే మేఘాలు—ఏ క్షణాన తమని వర్షంగా మార్చేసుకుంటాయో తెలీనట్లే-ఈ లేఖ నీ చీలికితోకాక మరేస్థానంలో అస్థికలతో దర్శనమిస్తుందో నాకే తెలీదు. నేను ముందే చెప్పానుగా! ఇది నా



కొరకు రాసుకుంటున్నా, కానీ ఇది నీ గూర్చి రాసేదే! సరే, ఇహ నిన్ను నా పిచ్చి కాకపోతే అర్థంలేని మాటలతో విసిగించను. అన్నట్టు నా పరీక్షలు ఇంకోవారం రోజులతో పరిసమాప్తి. తల్చుకుంటేనే ఎంత ఆనందం! ఎంత విశ్రాంతి! మళ్ళీ ఓపెనింగు టైమ్‌వరకు కావలసినంత తీరిక, బాదరబందీలేని జీవితం! అసలు కారణం అదికాదు నువ్వా సెలవుల్లో ఇక్కడకు వస్తావు—నాతో వుంటావు- మాట్లాడతావు- నవ్వుతావు - మాట్లాడుకుంటాము - నవ్వుకుంటాము-అప్పట్లా ఎన్నో కబుర్లు ప్రేమల గురించి, విరహాల గురించి, సైన్స్ గురించి, సాహిత్యం గురించి సంగీతం గురించి, గ్రహాల గురించి, మనభవిష్యత్ గురించిన ప్రణాళికలు వీటన్నిటిని తల్చుకుంటుంటేనే ఆకాశంలో ఎగిరిపోతున్నట్లు అనిపిస్తోంది. ఆ సమయం ఎంత త్వరగా వస్తే అంత హాయి. ఆ సౌఖ్యాన్ని తల్చుకుని నువ్వా నాలాగే సంతోషపడుతుంటావని-నీ పరీక్ష సమయంలో ఈ జోరు ఉత్తరం నిన్ను డిస్టర్బ్ చేయకూడదని నాకు నే ఏదో ఆనందంలో రాసుకుంటున్నాను, నీకు పోస్టు చేయకుండా.

ప్రియాతిప్రియమైన శిరీషారాణి! మన స్నేహాన్ని ఆ **భగవంతుడు** పదికాలాలపాటు ఆశీర్వదించాలని కోరుతూ-

నీ ప్రియమిత్రుడు
రవికిషోర్.

⁂




9, K. N. P. Colony,
Dharapuram Road, TIRUPUR-638 608